

ప్రధానమంత్రి యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి యోగా అవార్డు-2025కుగాను జాతీయ/అంతర్జాతీయస్థాయిలో వ్యక్తులు, సంస్థల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత విభాగంలో దరఖాస్తుదారులకు కనీస వయసు 40 సంవత్సరాలు ఉండాలని, 20 ఏళ్ల అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు నమోదు చేసుకోవాలని తెలిపారు.



ఇక సీట్లు కదులుతాయ్!

- ఉపాధి హామీ పథకంలో ప్రక్షాళనకు వేళాయె
- ఏళ్లతరబడి పాతుకుపోయిన వారెందరో..
- ఐదు నుంచి ఎనిమిదేళ్లుగా ఒకేచోట విధులు
- కొంతమందిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు
- సిఫార్సుల కోసం ఎమ్మెల్యేల వద్దకు పరుగులు



జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా)లో అక్రమాలు అన్నీఇన్నీ కావు. కొందరు ఏళ్లతరబడి పాతుకుపోవడంతో అవినీతి వేళ్లూనుకు పోయింది. ఎనిమిదేళ్లు ఒకేచోట పనిచేస్తున్నా రంటే 'ఫెవికాల్' వీరుల పైరవీలు ఏమేరకు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇక వైసీపీ హయాంలో పరిస్థితి చెప్పనలవి కాదు. అప్పటి ఎమ్మెల్యేలతో కొందరు అధికారులు అంటకాగి జేబులు నింపుకున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం డ్వామాలో ప్రక్షాళనకు నడుం బిగించింది. కంప్యూటర్ ఆపరేటర్ నుంచి ఏపీడీ వరకు బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఇప్పుడు కూడా కొందరు ఉద్యోగులు చక్రం తిప్పాలని చూస్తున్నారు. సిఫార్సు లేఖల కోసం కూటమి ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియ ఏమేరకు పారదర్శకంగా సాగుతుందో వేచిచూడాల్సిందే.

శ్రీకాకుళం, మార్చి 20(ఆంధ్రజ్యోతి):

జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా) ఆధ్వర్యంలో ఏటా రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. కేంద్రం, రాష్ట్రం మంజూరు చేసే నిధులను ఈ విభాగం ఖర్చు చేస్తుంటుంది. అయితే ఇందులో రెగ్యులర్ ఉద్యోగులు కొద్దిమందే. మిగిలిన వారందరూ.. ఎఫ్‌టీఈ (ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయ్) కింద పనిచేస్తున్న వారు. ఎఫ్‌టీఈలో ఏపీవో, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు ఉంటారు. వీరు ప్రతి మండలంలోనూ ఉంటారు. చాలా మంది ఎఫ్‌టీఈలు ఏళ్ల తరబడిగా ఒకేచోట పని చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి స్థానాలను మాత్రం పదిలం చేసుకుంటున్నారు. గతంలో బదిలీలు అక్కడక్కడ జరిగినా.. వీరు తమ సీట్లను పదిలం చేసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రక్షాళన చేపట్టింది. నిబంధనలకు అనుగుణంగా పనిచేసేవారు నింపాదిగా ఉంటున్నా.. ఏళ్లతరబడి ఒకే ప్రాంతానికి పరిమిత మైపోయిన వారిలో మాత్రం వణుకు మొదలైంది. ఈసారి కూడా ఎలాగైనా తప్పించుకుందామని.. లేదా కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయించుకుందామని ఎమ్మెల్యేలను కలుస్తున్నారు.

- ఉపాధి హామీ పనుల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తే తొలుత బలవుతుంది క్షేత్ర సహాయకులే. ఆతర్వాత అక్కడక్కడ టెక్నికల్ అసిస్టెంట్లు చిక్కుతున్నారు. తెరవెనుక ఉండి.. తతంగం నడిపించి.. సోషల్ ఆడిట్‌కూ చిక్కని ఇతర ఉద్యోగులు ఎంతోమంది ఉన్నారు. అలాంటి వారిలోనే ఇప్పుడు ఆందోళన మొదలైంది. వైసీపీ హయాంలో తాము కోరుకున్న ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకుని.. అడ్డగోలుగా వ్యవహరించి వారికి ఇప్పుడు స్థానచలనం తప్పేలా లేదు. జిల్లాలోని 30 మండలాల్లో 30 మంది ఏపీవోలు, 30 మంది ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, 100 మంది కంప్యూటర్ ఆపరేటర్లు (మండలానికి ముగ్గురు.. కొన్ని మండలాలకు నలుగురు), 180 మంది టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు. వీళ్లందరూ బదిలీలకు అర్హులే. క్షేత్రసహాయకులకు మాత్రం బదిలీలు ఉండవు.
- కూటమి ప్రభుత్వం కొలువు తీరాక కీలకమైన డ్వామా సిబ్బందిని బదిలీ చేయాలని టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేవంటూ జిల్లాస్థాయిలో బదిలీలు నిర్వహించలేదు. కొంతమందిపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు ఉన్నా కొనసాగుతున్నారు. తాజాగా డ్వామా ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లా పరిధిలో ఈ నెల 20లోగా బదిలీల దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలంటూ మార్గదర్శకాలను ఇచ్చింది. గురువారంతో దరఖాస్తు ప్రక్రియ ముగియడంతో ఇక ప్రక్షాళన చేపట్టనుంది. అన్ని స్థాయిల్లోని (మిగతా 6వ పేజీలో..)



గంజాయిని నిర్వీర్యం చేస్తున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టి, పక్కన ఎస్పీ మహేశ్వరరెడ్డి

మాదకద్రవ్యాలతో సంపాదించిన ఆస్తుల జప్తు

- గంజాయి నిర్మూలనకు పటిష్ఠమైన చర్యలు
- 3 జిల్లాల్లో సీజ్‌చేసిన 7,378 కిలోలు నిర్వీర్యం
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి

లావేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో సంపాదించిన ఆస్తులను జప్తు చేస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి హెచ్చరించారు. గంజాయి సమూల నిర్మూలనకు కఠినచర్యలు చేపట్టామన్నారు. ఇటీవల మూడు జిల్లాల్లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన గంజాయిని.. లావేరు మండలం పాతకుంకాం గ్రామంలోని రైస్ బో ఇండస్ట్రీ వద్ద గురువారం డీఐజీ పర్యవేక్షణలో ముగ్గురు ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, వకుల్ జిందాల్, ఎస్వీ మాధవరెడ్డి సమక్షంలో దహనం చేశారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ.. 'విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, వాటి మూలాలను గుర్తించి, బాధ్యులపై కేసులు నమోదు చేశాం. డీజీపీ హరీష్‌కుమార్ గుప్త ఆదేశాల మేరకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసులు 226 కేసుల్లో సీజ్ చేసిన 7,378 కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వీర్యం (మిగతా 6వ పేజీలో..)



మూడు జిల్లాల్లో ఇటీవల పట్టుబడిన గంజాయి నిల్వలు

హాస్టళ్లలో నాణ్యత పర్యవేక్షణకు కమిటీ

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో పరిశుభ్రత, పారిశుధ్యం, ఆహార నాణ్యతను పర్యవేక్షించడానికి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ అధికారులు ముగ్గురు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ, ఆహార తనిఖీ అధికారి, డీపీవో, మునిసిపల్ కమిషనర్లు నలుగురు, షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికారత అధికారి సభ్యులుగా ఉంటారు. వీరంతా హాస్టళ్లను క్రమం తప్పకుండా సందర్శించి అక్కడ అందుతున్న సౌకర్యాలను పరిశీలిస్తారు. ఏవైనా లోపాలుంటే వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటారు. విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని ఈ కమిటీ పని చేస్తుందని కలెక్టర్ తెలిపారు.



డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ

నిఘా ఏమైంది?

- పైడిభీమవరం పారిశ్రామికవాడపై నిర్లక్ష్యం
- పరిశ్రమల్లో అంతర్గత భద్రతపై అనుమానం
- ఆందోళనలో కార్మికులు, ఉద్యోగులు
- ప్రత్యేక పోలీసుస్టేషన్ ఏర్పాటు ఎప్పుడో?

రణస్థలం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడ పైడిభీమవరంపై నిఘా ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ సుమారు 30 పరిశ్రమలు ఉన్నాయి. బయో, ఫార్మా పరిశ్రమలు అధికం. వీటిలో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. కోట్లాది రూపాయల ఉత్పత్తులు, రహస్య పరిశోధనలకు సంబంధించి నివేదికలు ఉంటాయి. కానీ వాటిపై నిఘా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా రెడ్డీస్ ల్యాబ్‌లో మధుమేహం(షుగర్) టైప్-2కు సంబంధించి ఔషధాన్ని తయారుచేసే క్రమంలో కోట్లాది రూపాయలతో ప్రయోగాలు చేశారు. అలా తయారుచేసిన పౌడర్ మూడు వారాల కిందట చోరీకి గురైంది. కాగా దీనికి కారకులు ఎవరనేది ఇంతవరకూ తెలియలేదంటే పారిశ్రామిక వాడలో నిఘా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆయా ప్రాంతంలో సీసీ కెమేరాల నిఘా ఉండి, ఆ పుటేజ్ పరిశీలిస్తే సమస్య కొలిక్కివచ్చేది. అయితే దీనిపై పోలీస్ దర్యాప్తు కొనసాగుతోంది. రెడ్డీస్ ల్యాబ్ యాజమాన్యం ఈ ముడిసరుకు చోరీతో సంస్థ వ్యాపార లావాదేవీలకు ఎటువంటి నష్టం లేదని ప్రకటించింది. కానీ ఈ ఘటన నేపథ్యంలో ఫార్మా రంగంలో అగ్రగామిగా ఉన్న ఓ కంపెనీ యూనిట్‌లో ఇలా ఉంటే.. చిన్న పాటి పరిశ్రమలో నిఘా ఎలా ఉంటుందోనన్నది చర్చనీయాంశమవుతోంది.

- 1985లో ఏర్పాటు

రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ).. జిల్లాలో పరిశ్రమలను (మిగతా 6వ పేజీలో..)

దర్యాప్తు చేస్తున్నాం

రెడ్డీస్ ల్యాబ్‌లో మందుల తయారీకి సంబంధించి ముడిసరుకు చోరీ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. పైడిభీమవరం పారిశ్రామికవాడపై నిఘా పెట్టాం. అయితే లా అండ్ ఆర్డర్‌తో పాటు పారిశ్రామిక వాడలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అన్ని విధాలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం.

- ఎం.అవతారం, సీఐ, జేఆర్‌పురం

బీల.. ఎన్నో జీవులకు ఉయ్యాల
- ఏడాదంతా నీటి నిల్వలు
- వివిధ పక్షులకు నిలయం
- అరుదైన ప్రాణులకు ఆవాసం
6లో

అడవి అంతరిస్తోంది
- తరుగుతున్న వనాలు
- అధికారుల పర్యవేక్షణ లోపం
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం
6లో

'వంశధార'ను ఆధునికీకరించండి
- జిల్లాలో సాగునీటి సమస్యలపై పలాస, నరసన్నపేట, పాతపట్నం, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు శాసనసభలో ప్రస్తావన
8లో



ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌ను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

భళా ఎన్ఈఆర్!
- సీఎం, డిప్యూటీ సీఎంను నవ్వించిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే
- సాంస్కృతిక ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈశ్వరరావు
7లో

'గ్యాస్'పై అదనపు వసూళ్లు వద్దు

- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హెచ్చరిక

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వినియోగారులకు గ్యాస్ సరఫరా చేసే సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. డెలివరీ బాయ్స్ ఒక్కో సిలిండర్‌కు రూ.20 నుంచి రూ.50వరకు అదనంగా వసూలు చేస్తున్నట్టు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ చేపట్టగా నిజమని తేలింది. 'నిబంధనల మేరకు గ్యాస్ ఏజెన్సీ నుంచి 15కిలోమీటర్ల దూరంలో ఉన్న వినియోగదారుల వద్ద ఒక్కో సిలిండర్‌కు రూ.30మాత్రమే వసూలు చేయాలి. లేదంటే ఉచితంగా సరఫరా చేయాలి. అదనపు మొత్తం వసూలు చేసినా, వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసినా చర్యలు తప్పవు' అని జేసీ తెలిపారు. అలాగే 'జిల్లాలో 6,60,730 రేషన్‌కార్డుల్లో 19,39,082 మంది కుటుంబ సభ్యులున్నారు. వీరిలో 1,99,123 మంది ఈ-కేవైసీ పూర్తికాలేదు. వారంతా ఈ నెల 31లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాల'ని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. రేషన్ డీలర్, గ్రామ రెవెన్యూ అధికారి, తహసీల్దారు కార్యాలయంలో ఈ-పాస్ విధానం ద్వారా లేదా జీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ నమోదు చేసుకోవచ్చన్నారు.

ఇల్లు ఒకటే.. బిల్లులు రెండు

- జగనన్నకాలనీల్లో అనర్హులకు అందలం
- 2018లో పూర్తయిన ఇంటికీ బిల్లులు
- వైసీపీ హయాంలో అడ్డగోలు వ్యవహారం
- జమ్ములో ఇళ్ల స్థానంలో షాపుల నిర్మాణం
- చక్రం తిప్పిన గ్రామ వైసీపీ నాయకులు



- నడగాం గ్రామంలోని ఈ ఇంటికి బానాల భారతి (హౌసింగ్ ఐడీ నెం: 012209 ఎన్‌పీఐ 2621856) పేరిట బిల్లులు డ్రా చేశారు. ఈ ఇల్లు గత ప్రభుత్వం హయాంలో నిర్మించినట్లు రికార్డుల్లో రూపొందించారు. వాస్తవానికి అయితే ఆ ఇల్లు 2018లోనే నిర్మించారు.



- ఇవి రెండు ఇళ్లు కానేకాదు. ఒకటే. కానీ హౌసింగ్ రికార్డులలో మాత్రం రెండు ఇళ్లుగా నమోదు చేసి బిల్లులు చెల్లించారు. నడగాం గ్రామంలో లుకలాపు భవానీ, లుకలాపు సుమలత పేర్లతో ఇళ్లు మంజూరు చేశారు. నిర్మాణం సమయంలో రెండు ఇళ్లు వేర్వేరుగా నిర్మిస్తామని అఫిడవిట్ ఇచ్చి- తరువాత ఒకే ఒక బిల్డింగ్‌గా కట్టారు. ఆ తర్వాత బిల్లులు డ్రా చేశారు.

నరసన్నపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి):

వైసీపీ హయాంలో జగనన్న ఇళ్ల మంజూరులో అక్రమాలు అడ్డేలేదు. పాత ఇళ్లకు కూడా గత ప్రభుత్వ హయాంలో బిల్లులు మంజూరు అయ్యాయి. ఇద్దరి పేరిట పట్టాలు తీసుకుని ఒకే ఇల్లు కట్టి బిల్లులు పొందారు. నడగాం గ్రామంలోనే 11 ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని స్పందనలో ఫిర్యాదు చేయడంతో బిల్లుల బాగోతం బయటపడింది. జమ్ము జగనన్న కాలనీలో అనర్హులకే 60శాతం మేరకు పట్టాలు ఇచ్చి.. ఇళ్లు మంజూరు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

- నరసన్నపేట మండలంలో వైసీపీ ప్రభుత్వ హాయాంలో ఇంటి పట్టాలు, ఇళ్ల మంజూరులో వైసీపీ నాయకులు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. పాత ఇళ్లకే కొత్తగా బిల్లులు మంజూరు చేయించి డ్రా చేసుకోగా.. కొన్ని గ్రామాల్లో అనర్హులకు జగనన్నకాలనీలో పట్టాలు ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు 1600 ఇళ్లు మంజూరు అయ్యాయి. వీటిలో 30శాతం వరకు పాత ఇళ్లకే బిల్లులు చేసుకున్నారు. ఇవన్నీ వైసీపీ నాయకుల అనుచరులవేనని విమర్శలు ఉన్నాయి.
- నరసన్నపేట పట్టణంలో ఇంటి స్థలాలు లేనివారికి జమ్ములో ఏడు లేఅవుట్లను వైసీపీ ప్రభుత్వ హయాంలో వేశారు. సుమారు 800 మందికి పట్టాలు ఇచ్చారు. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు (మిగతా 6వ పేజీలో..)

ఎప్పుడో అంతరించిపోయిందనుకున్న పక్షి అక్కడ రివ్వున ఎగురుతూ సందడి చేస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ల నుంచి ఇప్పటి వరకు కనిపించని మరో పక్షి అక్కడ తిరుగుతున్నట్టు ఆనవాళ్లు చెబుతున్నాయి. ఝుమ్మనే శబ్దంతో అల్లరి చేసే తుమ్మెద ఒక్కటే ఉందనుకుంటాం. కానీ ఎన్నో రకాల తుమ్మెదలకు ఆ ప్రాంతం జన్మస్థానం. అందాల సీతాకోక చిలుకలు... వేలాది పక్షులకు... అరుదైన వృక్షాలకు అది క్షేత్రం. అదే ఉద్దానం ప్రాంతానికి గుండెకాయలాంటి బీల. ఎన్నో జీవులకు జోల పాడే నేల.

బీల.. ఎన్నో జీవులకు ఉయ్యాల





బీలలో నీరు

- ఏడాది పొడవునా నీటి నిల్వలు
- వివిధ రకాల పక్షులకు నిలయం
- అరుదైన ప్రాణులకు ఆవాసం

సోంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి)

బీల.. ఈ పేరు చెబితే ఓ దశాబ్దం కిందట ప్రజలు చేపట్టిన ఉద్యమం గుర్తుకొస్తుంది. దీని కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన అక్కడి మనుషులు గుర్తుకొస్తారు. ఆ పోరాటానికి.. ఆ త్యాగాలకు అర్థం ఉందని అక్షరాలా కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీనే స్పష్టీకరించింది. సోంపేట పట్టణానికి ఆనుకొని ఉన్న బీల చిత్తడి నేలల స్వర్గంగా నిలుస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం నియమించిన కోయం బత్తూరుకు చెందిన సంస్థ సలీమ్ అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ, ఎ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండర్ ది మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ (శాఖాన్) తెలిపింది. ఈ మేరకు 2017లో సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. ఈ నివేదికలో సోంపేట బీల ప్రాంతం చిత్తడి నేలలకు పుట్టినిల్లు అని... దీనిని కాపాడుకోవాల్సి బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలిపింది.

ఉద్యమంతో..

ఎన్‌సీసీ వారి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం బీల ప్రాంతంలో భూమిని కేటాయించింది. ఈ ప్రాంతం చిత్తడి నేల అని.. ఎల్లప్పుడూ నీటితో నిండి ఉంటుందని.. దీనిని నాశనం చేయొద్దంటూ ప్రజలు పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపట్టి.. ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. ఉద్యమక్రమంలో కాల్పులు జరిగి.. ముగ్గురు అమరులయ్యారు. దీంతో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. బీల ప్రాంతానికి సంబంధించి సమగ్ర నివేదిక అందజేయాలని పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ సలీమ్‌అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ, ఎ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండర్ ది మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ (శాఖాన్)ను ఆదేశించింది. దీంతో ఈ సంస్థ సభ్యుల బృందం తొలుత 2011లో ఆరు నెలల పాటు బీలలో పర్యటించి.. 2012లో తొలి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. ఆ తరువాత మరో ఐదేళ్ల పాటు వీరు ఈ ప్రాంతంలో అధ్యయనం చేసి 2017లో సమగ్ర నివేదికను అందజేశారు.

అరుదైన పక్షులకు నివాసం..

ఈ ప్రాంతం భౌగోళికంగా తూర్పు కనుమలను ఆనుకొని ఉన్న మైదాన ప్రాంతం, తూర్పు తీర ప్రాంతం కలిగి ఉండటం కారణంగా ఎక్కువగా పక్షులు నివాసం ఏర్పరచుకొనే అవకాశం ఉందని తెలిపారు. పక్షులు ఎక్కువగా కొండ, తీరప్రాంతాల్లో నివసించడానికి ఇష్టపడతాయి. ఇదే ప్రాంతంలో చిత్తడి నేలలు ఉండటంతో అవసరమైన ఆహారంతో పాటు పక్షుల నివాసానికి కూడా అనువుగా ఉంది. వీరు ఇచ్చిన నివేదిక ప్రకారం నీటి పక్షులైన సాంగ్‌బర్డ్స్, క్రేక్స్, వేడర్స్, రెయిల్స్, నీటి కాకులు (కార్మోరాండ్స్), డాటర్స్, రేప్టర్, లేప్‌వింగ్స్, స్లైప్స్, స్టింట్స్, పోలవర్స్ వంటి 23 జాతులకు చెందిన 500 పైగా పక్షులను గుర్తించారు. వీటితో పాటు మామూలు పక్షులు కూడా ఉన్నాయి. ముఖ్యంగా అంతరించిపోతున్న పక్షుల జాతులు ఆవాసాన్ని ఈ బీలలో ఏర్పరచుకున్నట్లు నివేదికలో పొందుపరిచారు. ఇంటర్‌నేషనల్ యూనియన్‌ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ సంస్థ అంతరించిపోతున్న పక్షి జాతి జాబితాలో కామన్‌పోచర్డ్ అనే పక్షిని 2016లో చేర్చింది. ఈ పక్షిని 2016 డిసెంబరు 15న కవిటి బీల ప్రాంతంలో గర్తించినట్టు నివేదికలో పొందుపరిచారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రత్యేక జీవ వైవిధ్య పరిస్థితులు చాలా రకాల పక్షుల నివాసానికి ఉపయోగపడుతున్నాయి. వేగంగా అంతరించి పోతున్న పెయింటెడ్ స్టార్క్, స్పాట్‌బిల్డ్ పెలికాన్, బ్లాక్‌హైడెడ్‌ఇబిస్, ఒరియంటల్‌డార్ట్, యూరేషియన్ కర్‌లూ, కర్‌లూసాండ్ పైపర్, అలగ్జాండ్రియన్ పెరాకిట్ పక్షులు ఉన్నట్లు నివేదికలో తెలియపరిచారు. అంతేకాకుండా 1949 నుంచి అంతరించిపోయింది అనుకుంటున్న పింక్ హెడ్ డక్ (రోడనెస కార్యోఫైలసియా) ఈ ప్రాంతంలో కనిపించే అవకాశం ఉందని కూడా తెలిపారు.



బీల మూడు రకాలు..

వీరి నివేదికలో బీలలో అరుదైన పక్షిజాతులు కూడా ఉన్నట్లు పొందుపరిచారు. సోంపేటలోని బీల మూడు రకాలుగా ఉందని ఈ బృందం సభ్యులు తెలిపారు. చిన్నబీల, పెద్దబీల, తంపర రకాలుగా వర్గీకరించారు. ఇందులో పెద్దబీల మిగతా రెండింటితో అనుసంధానంగా ఉంటుందని... తంపర సముద్రానికి దగ్గరగా ఉంటుందని తెలిపారు. సోంపేట మండలం బారువ నుంచి కవిటి మండలం కపాసుకుద్ది వరకు తీరం వెంబడి మొత్తంగా 20 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ చిత్తడి నేలలు దాదాపు 4000 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయని తెలిపారు. ఈ బీలలో 493 రకాల మొక్కలు, చెట్లను, 149 రకాల పక్షులను గుర్తించారు. జిల్లాలోనే అరుదైన 74శాతం వృక్షజాతులు, 52 శాతం పక్షులను ఈ ప్రాంతం కలిగి ఉందన్నారు.

ఎన్నో సీతాకోక చిలుకలు..

తమ సమగ్ర పరిశీలనలో భాగంగా 10శాతం చిత్తడి నేలల్లో 1500 వరకు నీటి పక్షులను గుర్తించారు. ఈ ప్రకారం మొత్తం బీల భూములో శీతాకాలం నాటికి 20వేలకు పైగా నీటిపక్షులు ఉంటాయని అంచనా వేశారు. సీతాకోక చిలుకలు ఉన్న ప్రాంతం జీవవైవిధ్య, పర్యావరణ సమతుల్యతకు గుర్తుగా చెప్పవచ్చు. ఈ ప్రాంతంలోని పొలాల గట్లపై 46 రకాల సీతాకోక చిలుకలు, 24 రకాల తుమ్మెదలను గుర్తించారు. ఇలా బీలప్రాంతంలో వైవిధ్యమైన పక్షులను గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పొందుపరిచారు. బీలను కాపాడుకుంటే... నీటి లభ్యతతో పాటు, వివిధ రకాల పక్షులు, జంతువులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

అడవి అంతరిస్తోంది

అడవులు... వేలాది జీవులకు నిలయమే కాదు.. పర్యావరణాన్ని పరిరక్షించే మూల కేంద్రాలు. వాతావరణ సమతౌల్యం... జీవరాశుల మనుగడ వీటిపైనే ఆధారపడి ఉంది. పచ్చదనంతో కళకళలాడే అడవులు ఉన్న ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. కానీ ఇప్పుడు ఆ అడవుల ఉనికికే ముప్పు వాటిల్లుతోంది. అడవులను నరికి... నివాసయోగ్యంగా మార్చడం... చెట్లను స్వార్థానికి బలి చేయడంతో అవి అంతరించిపోతున్నాయి. వీటి రక్షణకు ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలు ఆశించిన ప్రయోజనం ఇవ్వడం లేదు.

- రోజురోజుకీ తరుగుతున్న వనాలు
- ప్రమాదపుటంచున పర్యావరణం
- అధికారుల పర్యవేక్షణ లోపం
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం



అడవులకు నిప్పు పెట్టిన దృశ్యం

హిరమండలం, మార్చి 20(ఆంధ్రజ్యోతి)

అడవుల జిల్లాగా శ్రీకాకుళం పేరుగాంచింది. అడవులు, కొండలు, గలగలపారే వాగులు, సెలయేర్లు ప్రకృతి సోయగాలు మన జిల్లా సొంతం. అరుదైన వృక్ష, జంతు జాతులకు నిలయం. ఇదంతా గత కాలపు వైభవం. ప్రస్తుతం మనలోని స్వార్థచింతన, అత్యాశతో చేసే రంపపుకోతలు, గొడ్డలి వేట్లతో ప్రకృతి విలవిలాడుతోంది. వనాలు అంతరించిపోతున్నాయి. మనిషి మనుగడ సాధించాలంటే పర్యావరణ సమతుల్యం తప్పనిసరి. లేదంటే మానవుని జీవితం ప్రశ్నార్థకమవుతుంది. నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా మన జిల్లాలో వాటి పరిస్థితిని పరిశీలిద్దాం.

జిల్లాలో ఇలా..

జిల్లాలో అటవీ భూముల పరిస్థితి నానాటికి దిగజారుతోంది. రోజురోజుకూ అటవీ వైశాల్యం... విస్తరణ తగ్గుతూ వస్తోంది. జిల్లాలో అడవుల విస్తీర్ణం 77,741 హెక్టార్లు. సుమారు 10,474 హెక్టార్లలో టేకు, వెదురు, జీడి, వేప, నేరేడు, వేగిస చెట్లు ఉన్నాయి. అంతేకాక ఔషధ వృక్షాలు, పక్షులు, వన్యప్రాణులకూ ఇవే ఆవాసం. గిరిజనులకూ అటవీ ప్రాంతమే జీవనాధారం. ఏటా వేసవి కాలంలో వేల ఎకరాల్లో అటవీ సంపద బుగ్గిపాలవుతోంది. అటవీ అధికారుల పర్యవేక్షణ లోపం, కొందరు అక్రమార్కుల స్వార్థం, గిరిజనుల్లో అవగాహన రాహిత్యం వెరసి అడవులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీని కారణంగా పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోంది. వన్యప్రాణులు కూడా బలవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర అడవులదే. వీటి విస్తీర్ణం తగ్గకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాల్టా చట్టం చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫలితం కనిపించడం లేదు.

● పోడుతో ముప్పు.

అటవీ ప్రాంతాలను ఆవాసాలుగా చేసుకుని జీవిస్తున్న గిరిజనులకు ప్రధాన జీవనాధారం పోడు వ్యవసాయం. ప్రభుత్వం పోడు వ్యవసాయాన్ని నిషేధించింది. ప్రత్యామ్నాయంగా భూ పంపిణీ, కోట్లాది రూపాయలతో అడవుల అభివృద్ధి పనులను చేపట్టింది. అధికారుల చిత్తశుద్ధి లోపంతో పథకాలేవీ గిరిజనుల దరిచేరడం లేదు. దీంతో వారికి పోడు వ్యవసాయమే దిక్కవుతోంది. అడవుల్లో వేల ఎకరాల్లో పోడు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. వీటికి అటవీ హక్కుల చట్టం ద్వారా హక్కులు పొందుతున్నారు. కొంత మంది స్వార్థపరులు ఈ అడవులను తొలగించిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు. దీంతో పర్యావరణ సమతుల్యత లోపించి... కాలుష్యం పెరిగి... వ్యాధులు ప్రబలుతున్నాయి. ఫలితంగా ప్రాణవాయువు (ఆక్సిజన్) అందించాల్సిన అడవులు తరిగిపోయి... వాతావరణంలో కార్బన్‌డైయాక్సైడ్ శాతం పెరుగుతోంది.

● అడవుల విస్తీర్ణం తగ్గడానికి కారణాలు..

కలప స్మగ్లర్ల ధన దాహం, ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాల పేరిట అడవులను ఇతర అవసరాలకు వాడుకోవటం, వ్యవసాయం కోసం అడవులను ఆక్రమించడం, వన్యప్రాణుల వేట, మైనింగ్ కార్యకలాపాలు, భారీ వర్షాలు, కరువు, మంటలు, ప్రకృతి వైపరీత్యాలు అడవులు అంతరించడానికి కారణమవుతున్నాయి. అటవీ భూముల్లో గనుల తవ్వకాలకు అనుమతులివ్వడంలో ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో, పాఠశాల ఆవరణల్లోనూ ఏటా వేలాది మొక్కలు నాటుతున్నామని కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అవి ఎక్కడ నాటుతున్నారో... నాటినా వాటి పరిస్థితి ఎలా ఉందో అధికారులకే తెలియడం లేదు. ఆ మొక్కలకు సంబంధించిన వివరాలు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండడం లేదు.

● ఎంతో నష్టం

ఇష్టారాజ్యంగా చెట్లను నరికేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని జీవావరణానికి నష్టం వాటిల్లుతోంది. సరైన ఆవాసం లేక ఇప్పటికే 16 వేల రకాల జీవరాశులు అంతరించిపోయినట్టు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్, ఓజోన్ పొరకు రంధ్రాలు, ఆమ్ల వర్షాలు, సముద్రాలు ఉప్పొంగడం, సునామీలు వంటి ప్రకృతి వైపరీత్యాలు అధికమయ్యాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం ప్రమాద స్థాయిని దాటింది. ఏటా జనాభా పెరుగుతుండడంతో గ్రామాలు, పట్టణాలు విస్తరిస్తున్నాయి. దీంతో అడవుల శాతం తగ్గిపోతోంది.

● కాపాడాలంటే ...

● చట్టాలు చేసినంత మాత్రాన సరిపోదు. దానిని అమలు పరిచే యంత్రాంగం ఉండాలి. ● అటవీ శాఖపై మితిమీరిన రాజకీయ జోక్యాన్ని తగ్గించాలి. ● అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రోత్సాహకాలతో పాటు తప్పు చేసిన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి కఠినంగా శిక్షలు ఉండాలి. ● అటవీ ఉత్పత్తులతో ముడిపడి ఉన్న ప్రజల అవసరాలకు ప్రత్యామ్నాయాలను ఆలోచించాలి. ● అడవిని సామాజిక ఆస్తిగా ప్రతి ఒక్కరూ భావించాలి. ● అటవీ భూములపై రెవెన్యూ, అటవీ శాఖల మధ్య స్పష్టత ఉండాలి. ● అడవుల రక్షణలో వన సంరక్షణా సమితి సభ్యులను భాగస్వాములను చేస్తూ వారికి కొన్ని రకాల బాధ్యతలను అప్పగించాలి. ● అటవీ సిబ్బంది గిరిజనులతో తరుచూ సమావేశాలు ఏర్పాటు చేసి... అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. పోడు వ్యవసాయం వల్ల కలిగే ముప్పును వివరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ పంపిణీ, అడవుల అభివృద్ధి పనులు విస్తృతం చేయాలి.



నిప్పు పెట్టిన అడవులను చదును చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఇల్లు ఒకటే.. బిల్లులు రెండు

(ఐదో పేజీ తరువాయి)

అనర్హులను కూడా లబ్ధిదారులుగా చేర్చారు. 30శాతం పైగా ఇందులో అనర్హులు ఉన్నట్లు సమాచారం.

● రావాడపేట వద్ద 326ఏ జాతీయ రహదారికి అనుకుని వేసిన రెండు లే అవుట్లలో విలువైన స్థలాల పట్టాలను వైసీపీ నాయకులు, వారి అనుచరులకు మంజూరు చేశారు. ఇతర మండలాల్లో ఉన్నవారికి, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడో ఉన్నవారికి ఈ ఖరీదైన లే అవుట్‌లో పట్టాలు ఇచ్చారు. ఈ స్థలంలో ఇంటి పట్టాలు పొంది షాపుల నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

దర్యాప్తు చేపడతాం..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఇంటి నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులపై సమగ్రంగా దర్యాప్తు చేపడుతున్నాం. నడగాంలో ఇంటి నిర్మాణాలపై స్పందనలో ఫిర్యాదులు వచ్చాయి. జమ్ము లే అవుట్లలో ఇంటి పట్టాలు ఇచ్చింది రెవెన్యూ అధికారులు. నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన వాటిని పరిశీలన చేస్తాం. నిబంధనలకు వ్యతిరేకంగా చేపడితే రద్దు చేస్తాం.

- ఉరిటి రాజేంద్రప్రసాద్, గృహనిర్మాణ శాఖ ఏఈ

ఇక సీట్లు కదులుతాయ్!

(ఐదో పేజీ తరువాయి)

మూడేళ్లు ఒకేచోట పనిచేస్తే వారిని బదిలీ చేయవచ్చు. ఐదు సంవత్సరాలు ఒకేచోట పనిచేస్తుంటే తప్పనిసరిగా స్థానచలనం కల్పించాల్సిందే. ఇదిలా ఉండగా ఏపీవోలను జిల్లా యూనిట్‌గా బదిలీలు చేయనున్నారు. ఇతర ఉద్యోగులను క్లస్టర్ స్థాయిలో, జిల్లా కార్యాలయంలో పనిచేసే వారిని ఐదేళ్లు దాటితే క్లస్టర్‌కు, మూడేళ్లు దాటితే అదే కార్యాలయంలో స్థానాల మార్పునకు అవకాశం ఇచ్చారు. బదిలీల ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకుగాను ప్రభుత్వం త్రీమెన్ కమిటీ నియమించింది. కలెక్టర్, డ్వామా పీడీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సభ్యులుగా ఉంటారు. గురువారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు కూడా ముగిసింది.

మాదకద్రవ్యాలతో సంపాదించిన ఆస్తుల జప్తు

(ఐదో పేజీ తరువాయి)

చేశాం. అనకాపల్లి జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 34,419 కిలోల గంజాయి, 39.4 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను నిర్వీర్యం చేశాం. రెండో దశలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత నెల 3,075 కిలోల గంజాయిని, 25.5 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను దహనం చేశాం. మూడో దశలో గురువారం శ్రీకాకుళం జిల్లాలో ఈ కార్యక్రమా న్ని చేపట్టాం. గడచిన 8 నెలల్లో గంజాయి పూర్తిస్థాయి నిర్మూలనలో భాగంగా 524 కేసు ల్లో 31,768 కిలోల గంజాయిని, 120.5 లీటర్ల హాషిష్, 372 వాహనాలను సీజ్‌చేసి 2,050 మంది నిందితులను అరెస్ట్ చేశాం. ఇందులో 575 మంది అంతరాష్ట్ర నిందితులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికలో రేంజ్ పరిధిలో ఒడిశా సరిహద్దు ప్రాం తం నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించాం. 24 అంతరాష్ట్ర, 14 జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేశాం. డ్రోన్ కెమెరాల నిఘా ఏర్పాటు చేసి, 327 గ్రామాల్లో 90 ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయిని నిర్వీర్యం చేశాం. గంజాయిని అక్రమంగా సాగు చేస్తున్న 34 అంతరాష్ట్ర ముఠా, 21 అంతర జిల్లాల ముఠాలను పట్టుకుని వారిలో 467 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిందితులుగా గుర్తించాం. ఈ కేసులకు సంబంధించి 49 మందిపై పీడీ యాక్ట్, 1,031 మందిపై గంజాయి సస్పెక్ట్ షీట్స్ తెరిచాం. విశాఖ రేంజి పరిధిలో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు 'సంకల్పం' పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 5 లక్షల మంది విద్యార్థులకు చైతన్యం కలిగించాం. ప్రతి పాఠశాల, కళాశాలలో డ్రాప్ బాక్సును ఏర్పాటు చేశాం. 23 గంజాయి కేసుల్లో 40 మందికి న్యాయస్థానాల్లో శిక్ష ఖరారుకాగా, సుమారు 20 మందికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షలు విధించారు. గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించే ఆస్తులను జప్తు చేస్తాం. ఇప్పటికే విజయనగరం, అనకాపల్లి జిల్లాలో చెరొకటి కేసుల్లో ఆస్తులు జప్తుచేశాం. రేంజ్ పరిధిలో గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన 86 మందిని డి-అడిక్షన్ కేంద్రాలకు పంపించి కౌన్సెలింగ్ ఇచ్చామ'ని తెలిపారు. 'గంజాయి సాగును నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ పంటలకుగాను రబీ సీజన్‌లో 4.68 ప్లాంట్లలో 22 రకాల విత్తనాలను 11ఎకరాల్లో సాగుకు అందజేశాం. ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా 20 మండలాల్లో 10,256 మంది రైతులు పంటలు పండించేందుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే రాజ్మా చిక్కుడు విత్తనాలు 4,496 కిలోలు పంపిణీ చేశామ'ని డీఐజీ తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు పి.శ్రీనివాసరావు, పి.సౌమ్యలత, అంకిత సూరన పాల్గొన్నారు.

నిఘా ఏమైంది?

(ఐదో పేజీ తరువాయి)

ఏర్పాటుచేసేలా పారిశ్రామికవాడను నెలకొల్పింది. 1985లో పైడిభీమవరంలో 450 ఎకరాల్లో భారీ పారిశ్రామిక వాడను ప్రారంభించింది. ఇందులో 275 ఎకరాలను రసాయనిక జోన్‌కు కేటాయించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 13 రసాయన పరిశ్రమలు కొనసాగుతున్నాయి. సరాక, అపర్ణ, అరబిందో, డాక్టర్ రెడ్డీస్, ఆంధ్రా ఆర్గానిక్స్ వంటి భారీ పరిశ్రమలున్నాయి. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ పనిచేస్తుంటారు. ఇక్కడ ఉన్న పరిశ్రమల్లో భద్రత, నిఘా నిద్దరోతుండగా... అటు కార్మికులకు సైతం రక్షణ లేకపోతోంది. ఫలితంగా పైడిభీమవరం అంటేనే సామాన్యులు హడలెత్తిపోయే ప్రమాదం ఏర్పడింది.

● విద్రోహ చర్యగా అనుమానం..

జిల్లాలో సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉంది. పైడిభీమవరం పారిశ్రామిక వాడకు కూతవేటు దూరంలోనే సముద్ర తీరం విస్తరించి ఉంది. ఆపై ప్రధాన జాతీయ రహదారి, దగ్గరల్లోనే రైల్వే మార్గం కూడా ఉంది. కానీ పారిశ్రామికవాడలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) గార్ప్ మచ్చుకైనా కానరావడం లేదు. రెడ్డీస్ ల్యాబ్‌లో చోరీ ఘటన.. విద్రోహ చర్య అన్న అనుమానం తలెత్తుతోంది. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వపరంగా కూడా ప్రత్యేక పోలీస్‌స్టేషన్ అవసరం ఉంది. ఇక్కడ సబ్ పోలీస్‌స్టేషన్ పేరిట సిస్కో స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కానీ అక్కడ ఇద్దరు, ముగ్గురు పోలీస్ సిబ్బంది మాత్రమే ఉంటున్నారు. పారిశ్రామికవాడలో ఏ చిన్నపాటి ఘటన జరిగినా, అగ్నిప్రమాదాలు సంభవించినా జే.ఆర్.పురం పోలీసులపై భారం పడుతోంది. అగ్నిమాపక సేవలు కూడా అంతంతమాత్రమే. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పలు మండలాల నుంచి అగ్నిమాపక వాహనాలు రావడానికి ఆలస్యమవుతోంది. అవి వచ్చే సమయానికి జరగాల్సిన నష్టం జరిగి పోతుంటుంది. ఇప్పటికైనా పైడిభీమవరం పారిశ్రామికవాడపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

తంపర భూముల్లో ఏనుగుల గుంపు

కొత్తూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వసప పంట పొలాల పరిధిలో గల తంపర భూముల్లో ఎనిమిది రోజులుగా నాలుగు ఏనుగుల గుంపు వాణిజ్య పంటలను ధ్వంసం చేస్తోంది. దీంతో వసప, కుంటిబద్ర గ్రామాల రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. జొన్న, పుచ్చకాయ, చెరకుతోపాటు వాణిజ్య పంటలనుఎ ఏనుగులు ధ్వంసం చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో ఉన్న ఏనుగులు చీకటిపడిన తర్వాత గ్రామాల వైపు వస్తాయేమోనని బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. తక్షణమే ఏనుగులను తరలించి... తమను ఆదుకోవాలని అధికారులను రైతులు కోరుతున్నారు.



వసప పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

భళా.. ఎన్‌ఈఆర్!

- సీఎం, డిప్యూటీ సీఎంను నవ్వించిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే
- తన నటనతో అందర్నీ మెప్పించిన వైనం



నవ్వుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్



స్కిట్ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యేలు ఎన్‌ఈఆర్, రవికుమార్

రణస్థలం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తన నటనా కౌశల్యంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు స్పీకర్, ఎమ్మెల్యేలు, మంత్రులను కడుపుబ్బా నవ్వించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఏపీ శాసన వ్యవస్థ సాంస్కృతి శోభలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ప్రదర్శనల్లో ఎన్‌ఈఆర్ తన కామెడీతో ఆకట్టుకున్నారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరాపు విజయ్‌కుమార్‌తో కలిసి ప్రదర్శించిన స్కిట్ కడుపుబ్బా నవ్వించింది. అలాగే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా మరో స్కిట్‌లో నటించి ఆకట్టుకున్నారు. వీరిని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తోటి ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గార, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శాలిహుండంలో ఉన్న కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.లలితకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు నేరుగా కళాశాలలో గాని, లేకుంటే 18004258599 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

- జి.సిగడాం: స్థానిక కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రమీల గురువారం ఒక ప్రకటనలో కోరారు. 6వ, తరగతి, ఇంటర్ గ్రూపులతోపాటు 7, 8, 9, 10 తరగతులు, ఇంటర్‌లో మిగులు సీట్లకు భర్తీ చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.
- పొందూరు: లోలుగు వద్ద గల కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సౌమ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 70751 59996 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

అతడి నేత్రాలు సజీవం



ధర్మరాజు(ఫైల్)

అరసవల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని విశాఖ-ఏ కాలనీకి చెందిన పొట్నూరు ధర్మరాజు(71) గురువారం మృతి చెందాడు. అతడి నేత్రాలు దానం చేయాలని నిర్ణయించుకున్న కుటుంబ సభ్యులు రెడ్ క్రాస్ ప్రతినిధులను సంప్రదించారు. దీంతో నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పి.సుజాత, పి.సుమతి అక్కడికి చేరుకుని ధర్మరాజు కళ్ల నుంచి కార్నియాలు సేకరించి, విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. రెడ్ క్రాస్ జగన్మోహన్‌రావు, బలివాడ మల్లేశ్వరరావు నివాళులర్పించారు.

ఐదు దుకాణాలు, ఒక ఇల్లు సీజ్



చాపురంలో ఓ దుకాణానికి సీల్ వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పన్ను బకాయిలు చెల్లించని వారిపై నగరపాలక సంస్థ అధికారులు కొరఢా ఝులిపించారు. కార్పొరేషన్ పరిధిలోని దుకాణాలు, ఇళ్ల స్థలాలకు గాను గడిచిన కొన్నేళ్లుగా పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో కమిషనర్ పీవీవీ ప్రసాదరావు ఆదేశాల మేరకు గురువారం ఆర్ఐ ఉమామహేశ్వరరావు, రెవెన్యూ అధికారులు దుకాణాలతో పాటు, ఇంటికి తాళాలు వేసి సీజ్ చేశారు. చాపురం పంచాయతీలో నామానం బాసుకి చెందిన దుకాణం ఐదేళ్లకు గాను రూ.4.50 లక్షలు, నగరంలోని దండివీధిలోని ఓ మెకానిక్ షాపునకు ఐదేళ్లకు లక్ష రూపాయలు, కొన్నావీధిలో ఓ ఇంటికి ఏడేళ్లకు రూ.60 వేలు, చిత్తరంజన్‌వీధిలోని ఎన్నేటి కృష్ణారావుకి చెందిన దుకాణానికి రూ.3.15 లక్షలు, మరో రెండు దుకాణాలు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. అయితే పన్ను బకాయిలు చెల్లించమని నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో ఆర్ఐ ఉమామహేశ్వరరావు రెవెన్యూ సిబ్బందితో కలిసి బకాయి చెల్లించని దుకాణాలకు, ఓ ఇంటికి తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ పీవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా పన్ను బకాయిలు చెల్లించని వారికి నోటీసులిచ్చామని స్పందించకపోవడంతో సీజ్ చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి బకాయిలు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు.

పర్యావరణంలో పిచ్చుకలదీ కీలకపాత్రే

పొందూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలంటే పిచ్చుకలను కాపాడుకోవాలని తాడివలస హెచ్‌ఎం బి.కంఠయ్య, నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ పూజారి హరిప్రశన్న అన్నారు. పాఠశాలలో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. పెరుగుతున్న రేడియేషన్‌తో పిచ్చుకలు అంతరించి పోతున్నాయన్నారు. వ్యవసాయ దిగుబడులు పెరగడంలో పిచ్చుకలు సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు డీఏ, ఐఆర్ ప్రకటించాలి

గుజరాతీపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం ఏర్పడి సుమారు పది నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయల ఆశలు అడియాశలుగా ఉన్నాయని, ఉగాది కానుకగా పెండింగ్ డీఏను, ఐఆర్ వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు టి.చలపతిరావు, బి.రవి, బి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలు యథావిధిగా కొనసాగిస్తూ పంచాయతీకో ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి చట్టం తీసుకురావడం శుభపరిణామన్నారు.

ఇంటర్ స్పాట్ వద్ద నిరసన

గుజరాతీపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో సంస్కరణలు పేరిట మాతృభాష తెలుగును పూర్తి నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యూయేషన్ వద్ద గురువారం తెలుగు అధ్యాపకులు నిరసన చేపట్టారు. స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల ప్రాంగణం వద్ద మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిరసన చేపట్టారు. తెలుగు భాష ఉనికి, తెలుగు సబ్జెక్టు మనుగడను అధ్యాపకుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకునేందుకు ఈ నిరసన చేపట్టామన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల గ్రీవెన్స్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రతీ నెలా మూడో శుక్రవారం విభిన్న ప్రతిభావంతులకు నిర్వహిస్తున్న స్వాభిమాన్ వినతుల స్వీకరణ 21వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఆ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలకు వైద్య పరీక్షలు

రణస్థలం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహిళలు క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు పిన్నింటి భానోజీనాయుడు అన్నారు. జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం రణస్థలంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఎంతో ఖరీదైన వివిధ వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. వైద్యులు ప్రవీణ్‌తో పాటు స్థానికులు కలిశెట్టి సూర్యనారాయణ, మజ్జి వెంకటరమణ, సింహాచలం, రాంబాబు, మహదాసు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న విశ్వక్సేన్

జి.సిగడాం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద బాధితులను గురువారం ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి విశ్వక్సేన్ పరామర్శించారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుంచి సహాయ, సహకాలు అందేలా కృషి చేస్తానని బాధితులకు ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు భూపతి అర్జున్‌కుమార్, తాలాబత్తుల పైడిరాజు, పొగిరి అప్పలనాయుడు, శివ, సతీష్, దుర్గారావు, సింహాచలం తదితరులు ఉన్నారు.

సేవలు ప్రజలకు మరింత చేరువకావాలి



పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైం/ఎచ్చెర్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఎచ్చెర్ల ఆర్మ్ రిజర్వ్ విభాగం, పోలీసు కార్యాలయం, డీసీఆర్బీ, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్టు విభాగాలను సందర్శించి రికార్డులు నిర్వహణను పరిశీలించారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా సాయుధ దళాల పనితీరు, ఆయుధాలు, రికార్డులు, మోటారు వాహనాల వినియోగం తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ కేవీ రమణ, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీవో ఏవో గోపీనాథ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఇమ్మాన్యూల్‌రాజు, డీఎస్పీలు వివేకానంద, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోండి

అరసవల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతీచోటా జరుగుతున్న మెడికల్ మాఫియాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణను గురువారం ఆయన కార్యాలయంలో కలుసుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో గల అనేక ఆసుపత్రుల్లో వైద్య సేవలకు సంబంధించిన ధరల పట్టికను ప్రదర్శించడం లేదని, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా ప్రజల వద్ద నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో కొన్ని ఆసుపత్రులకు సరైన అనుమతులు కూడా లేవని, భద్రతా ప్రమాణాలు కూడా పాటించడం లేదన్నారు. వీరి ఆగడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో భవిష్యత్తులో దీనిపై అనేక పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఆర్.అరవింద్, టి.మధు, జి.వసంత్, జె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

ఆమదాలవలస, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గ్రామ సంఘ పొదుపులు, బ్యాంకు పొదుపులు, పొదుపుల నుంచి అంతర్గత అప్పులు, బ్యాంకు రుణాలు స్త్రీనిధి అప్పులు తదితర అన్ని వివరాలను మొబైల్ బుక్‌కీపింగ్‌లో నమోదు చేయాలని ఏపీఎం జి.నారాయణరావు అన్నారు. గురువారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా పరస్పర సహకార సహకార గ్రామ సంఘం అసిస్టెంట్లకు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు లోకోస్ యాప్‌లో స్వయం సహాయ సంఘాల ఆర్థిక లావాదేవీలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షుడు టి.ధనలక్ష్మి, కోశాధికారి సూర్యకుమారి, కార్యదర్శి బి.రోజా, ఏరియా కోఆర్డినేటర్ పి.రవికుమార్, సీసీలు, అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సే ధ్యేయం కావాలి

ఎచ్చెర్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు అందరి ధ్యేయం కావాలని గిరిజన యూనివర్సిటీ (విజయనగరం) సోషల్‌వర్క్ విభాగం అధ్యాపకుడు ఎం.నగేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సోషల్‌వర్క్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వరల్డ్ సోషల్ వర్క్ డే నిర్వహించారు. కార్యక్రమంలో బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, మానవ హక్కుల నేత వీఎస్ కృష్ణ, వర్సిటీ సోషల్‌వర్క్ విభాగాధిపతి యు.కావ్యజ్యోత్స్న, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

ఇచ్ఛాపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన గురువారం జరిగిన బహిరంగ వేలం పాట వాయిదా పడింది. ప్రభుత్వ వేలం పాట ఎక్కువ కావడంతోపాటు అదనంగా 18శాతం జీఎస్టీ వేయడం, వాచ్‌మెన్ జీతం ఏడాదికి రూ1.50 లక్షల నుంచి రూ.2.88 లక్షలు పెంచడంపై పాటకు హాజరైన పాటదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వేలం పాట రేట్లు అధికం చేయడంతో పాటు కొత్తగా జీఎస్టీ చెల్లించాలని నిబంధనలతో మాకు నష్టం జరుగుతుందని ఆశీలు పెంచితే వ్యాపారులు చెల్లించటానికి ముందుకు రావడం లేదన్నారు. వేలం పాట ధర తగ్గిస్తే వేలం పాటలో పాల్గొనమని పాటదారులు చెప్పడంతో వేలం పాటను ఈనెల 25కి కమిషనర్ వాయిదా వేశారు. కార్యక్రమంలో ఏడుగురు పాటదారులు పాల్గొన్నారు.

సొంతబిడ్డల్లా చూడాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి శాంతిశ్రీ

ఆమదాలవలస, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్, సాధికారిత అధికారిణి బి.శాంతిశ్రీ అన్నారు. గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో ఎస్.అనురాధ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల శిక్షణ తొలిరోజు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పోషణ్‌ట్రాకర్ అనే అంగన్‌వాడీ వర్కర్ మొబైల్ యాప్‌లో ప్రతి ఒక్క లబ్ధిదారుని ఫేస్ కాప్చర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీబాయి, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అరసవల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు మీటర్ల రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విద్యుత్తు కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం వారు డీఈ, ఎస్ఈలకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చాపర వెంకటరమణ, కుమారస్వామి, శ్రీనివాస్, బాలకృష్ణ, వేణు, కొన్న శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళాచక్రవర్తి.. బండారు



చిట్టిబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ లలిత సంగీత స్వరకర్త బండారు చిట్టిబాబు ఒక సంగీత కళా ప్రవీణ చక్రవర్తి అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం బాపూజీ కళా మందిర్‌లో ఘంటసాల, బాలు, జి.ఆనంద్ స్వరమాధురి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బండారు చిట్టిబాబు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండపాక శారద, డా.మాలతి, నిక్కు అప్పన్న, పి.జగన్మోహనరావు, ఎల్.రామలింగేశ్వరరావు, సురంగి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి అండగా..



ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రుల

ఆమదాలవలస, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తమ స్నేహితుడు ఎన్.సంగమేష్‌కు తోటి స్నేహితుడు ఆర్థికసాయాన్ని అందించారు. గాజులకొల్లివలస గ్రామానికి చెందిన ఎన్.సంగమేష్ భార్య వసంతకుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సంగమేష్ భార్య మృతి చెంది వారి ఆర్థిక ప రిస్థితి అంతంతమాత్రమే ఉందన్న విషయాన్ని తెలుసుకొని ఇంటర్మీడి యట్ (2001-03) బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు సంగమేష్ ఇంటికి చేరుకొని తమవంతు సాయంగా రూ.40 వేలు సాయాన్ని అందించి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు.

నేడు రిమ్స్‌కు అకడమిక్ డీఎంఈ రాక

అరసవల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రిమ్స్ వైద్య కళాశాల, సర్వజన ఆసుపత్రిని పరిశీలించేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకడమిక్) డీఎస్‌వీఎల్ నరసింహం శుక్రవారం రానున్నారు. రిమ్స్ వైద్య కళాశాల, ఆసుపత్రికి సంబంధించిన సమస్యలు, ఇతర విషయాలను పరిశీలిస్తారు. పనితీరు మెరుగు కావలసిన సూచనలు, సలహాలు, అలాగే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కావలసిన సహకారాన్ని అందిస్తారు.

ఆర్థిక అసమానతలు తొలగించాలి



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు చంద్రమోహన్

శ్రీకాకుళం రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించడమే లక్ష్యంగా ప్రతీ జనసేన కార్యకర్త కలిసి కట్టుగా పని చేయాలని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రూరల్ మండల పరిధిలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో పార్టీ జెండాలు ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.పాపారావు, నాయకులు సత్తిబాబు, కూరాకుల యాదవ్, సంతోష్ పండా, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆమదాలవలస, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి సారించిందని పురపాలక సంఘం మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. గురువారం పురపాలక సంఘం 9వ వార్డు పరిధి అమ్మానగర్‌లోని సీసీ రహదారిని రూ.6.02 లక్షలతో, పదో వార్డులోని వాంబే కాలనీలో శ్మశాన వాటిక రహదారిని రూ.7 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులకు ఆమె శంకుస్థాపన చేశారు. టీడీపీ నేతలు సంపదరావు మురళి, నాగళ్ల మురళీధర్, తంగి గురయ్య, వి.కొండబాబు, అన్నెపు కృష్ణకాంత్, చిరంజీవి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జి.సిగడాం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన పలు మృతుల కుటుంబాలను గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ పరామర్శించారు. ఎందువపేట, నాగులవస పంచాయతీ వీఆర్ పేట గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు గెల్ల కృష్ణ తల్లి గెల్ల లక్ష్మి, ఇనపగుర్తి రమణ తల్లి ఇనపగుర్తి సీతమ్మ ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను పార్టీశ్రేణులతో కలిసి రవికుమార్ పరామర్శించారు.

సునీతా విలియమ్స్ గౌరవార్థం..



రాహుల్

శ్రీకాకుళం కల్చరల్ మార్చి 20(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా భువికి తిరిగి వచ్చిన భారతీయ సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ గౌరవార్థం పావురం ఈకపై రూపొందించిన ఆమె చిత్రం ఆకట్టుకుంటుంది. దీన్ని నగరానికి చెందిన చిత్రకారుడు వాడాడ రాహుల్ పట్నాయక్ రూపొందించారు.



పక్షి ఈకపై సునీతా విలియమ్స్ చిత్రం

గేట్‌లో ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ



కేక్ కట్‌చేస్తున్న క్యాంపస్ డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు గేట్‌లో ప్రతిభ కనబరిచారు. ఈ క్యాంపస్‌లో కోమర్ల శ్వేత 241వ ర్యాంకు, అప్పన శ్రీనివాస్ 663వ ర్యాంకు, పెనుమర్తి గౌతమ్ 405వ ర్యాంకు, కేశవరాపు మూర్తి 655వ ర్యాంకు, ఎస్.తిలక్ సూర్య 937 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఇక్కడి క్యాంపస్‌లో కేక్‌ను క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ కట్‌చేశారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఎఫ్‌వో వాసు, వెల్ఫేర్ డీన్ రవి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి 204వ ర్యాంక్..



అద్దూరి నివాస్

అరసవల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గేట్ పరీక్షలో శ్రీకాకుళం నగరం వాంబే కాలనీకి చెందిన అద్దూరి నివాస్ ఆల్ ఇండియా స్థాయిలో 204వ ర్యాంకు సాధించాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేసిన తండ్రి మరణించగా.. తల్లి అనూరాధ టైలరింగ్ చేస్తూ కుమారుడ్ని చదివించింది. ఈ క్రమం నివాస్ టెన్త్‌లో 10/10, ఇంటర్‌లో కూడా 20/10 స్కోరు సాధించాడు. అనంతరం జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్ పూర్తిచేసి, ప్రస్తుతం ఐఐటీ చెన్నైలో ఎంటెక్ (సివిల్) రెండో ఏడాది చదువుతున్నాడు.

'వంశధార'ను ఆధునికీకరించండి

● జిల్లాలో సాగునీటి సమస్యలపై పలాస, నరసన్నపేట, పాతపట్నం, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు శాసనసభలో ప్రస్తావన

వంశధార కాలువలను ఆధునీకరించాలని పలాస, నరసన్నపేట, పాతపట్నం, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, గొండు శంకర్ కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో జిల్లాలో సాగునీటి సమస్యలపై ప్రస్తావించారు. టెక్కలి, పలాస నియోజకవర్గాల్లో ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చంద్రబాబుతోనే శివారు ఆయకట్టుకు నీరు


మాట్లాడుతున్న గౌతు శిరీష

పలాస, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వంశధార కాలువ ఆధునీకరించి ఆయకట్టుకు సాగునీరందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. గురువారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ వంశధార వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు, స్పీకర్ ఉన్నా వంశధారను పట్టించుకోలేదని,కనీసం కాలువ ఆధునీకరించి నీరందిస్తామన్న ధ్యాసే లేదని విమర్శించారు. పలాస నియోజకవర్గం నుంచి ఎన్నికైన వ్యక్తే మంత్రిగా వ్యవహరించినా వంశ ధారపై నిర్లక్ష్యం వహించారని, ఐదేళ్ల నీరు లేక రైతు లకు ఇబ్బందులుపడ్డారన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శివారు భూములకు నీరందించినట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న వంశధార ఎడమ కాలువను ఆధునీకరిస్తే పూర్తి స్థాయి నీరు శివారుభూముల వరకూ అందుతుందన్నారు.గతంలో కాలువ ఆధు నీకరణ చేసిన కాంట్రాక్టర్లకు ఇంతవరకూ బిల్లులు కూడా ఇంకా అందించలేదని, దీనిపై ప్రభుత్వం శ్రద్ధ వహించాలని కోరారు.

కుంభకోణంపై దర్యాప్తు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వంశధార ఆధునీకరణకు 2019లో డీపీఆర్ తయారుచేసినా, గతప్రభుత్వం నిర్లక్ష్యంతో మురుగున పడిందని బగ్గు రమణమూర్తి ఆరోపించారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ టెక్కలి, పలాస నియోజవర్గాలకు సాగునీరు అందడం లేదని, వంశధార ఎడమ కాలువ పరిధిలో 1.64 లక్షలు ఎకరాలు ఉంటే, నరసన్నపేట నియోజవర్గంలో 74 వేల ఎకరాలు సాగుభూమి ఉందని తెలిపారు. నది చెంతనా ఉన్నా కాలువ ద్వారా సాగునీరు అందడం లేదన్నారు. షట్లర్లు కుంభకోణం వల్ల కాలువలకు షట్టర్లు అమర్చలేక నీరు వృథాగా పోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కుంభకోణంపై దర్యాప్తు పూర్తి చేయాలని, మిగిలి ఉన్న షటర్లు తుప్పు పట్టకుండా ఏర్పాటు చేయాలని కోరారు.

కాలువల్లో పూడికలు తీయాలి


మాట్లాడుతున్న మామిడి గోవిందరావు

పాతపట్నం, మార్చి20 (ఆంధ్రజ్యోతి): వంశధార కుడి, ఎడమ కాలువల్లో పూడికతీతలు చేపట్టి ఆధునికీకరించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు.అసెంబ్లీలో మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కనీసస్థాయిలో మరమ్మతులు జరగకపోవడంతో నిర్దేశిత ఆయకట్టుకు నీరందడంలేదని తెలిపారు. అవసరమైనచోట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలకు 100 ఎంఎం సీసీ లైనింగ్ ఏర్పాటుచేస్తే జిల్లా వ్యాప్తంగా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుందని తెలిపారు.

పెండింగ్ పనులను పూర్తిచేయాలి


ముఖ్యమంత్రికి సమస్యను వివరిస్తున్న గొండు శంకర్

అరసవల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. గురువారం ఆయన అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలో 30వేల ఎకరాలు శివారుఆయకట్టు భూములు ఉన్నాయని తెలిపారు. వీటి పరిధిలో చాలా వరకు పనులు పెండింగ్‌లో ఉండిపోయాయని చెప్పారు. వత్సవలస లిఫ్ట్ ఇరిగేషన్ పనుల కోసం ప్రపోజల్ చేసినట్లు తెలిపారు. కళింగపట్నం ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని వాటిని వెంటనే పూర్తి చేయాలని కోరారు. రూ.175 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మంజూరైనా గత ప్రభుత్వం ఐదు శాతం కూడా చేయలేదని ఆరోపించారు. వాటి పూర్తికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రిని కోరారు. శ్రీకాకుళం పట్టణంలో 1500 కుటుంబాలు తమ ఇంటికి విద్యుత్తు, ఇంటి పన్నులు కడుతున్నారని, వాటిని రెగ్యులర్‌చేయాలని, కంపోస్టు కాలనీలో 200 కుటుంబాలు ఉన్నాయని, వాటిని రెగ్యులర్ చేయాలని కోరారు. అలాగే కళింగపట్నం వద్ద జెట్టీ నిర్మాణానికి కేంద్రం రూ.10కోట్లు మంజూరు చేస్తే గత వైసీపీ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని, దీనికి సంబంధించి కేంద్రానికి లేఖ రాయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఎమ్మెల్యే శంకర్ కోరారు. దీనిపై స్పందించిన చంద్రబాబు వెంటనే కేంద్రానికి లేఖ రాయాలని సీఎస్ రవిచంద్రను ఆదేశించారు.

వైఎస్ఆర్ బీమా పెద్ద మోసం: రవికుమార్


మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ పాలనలో వైఎస్ఆర్ బీమా పేరుతో పెద్ద మోసం జరిగిందని ఎమ్మెల్యే రవికుమార్ ఆరోపించారు. గురువారం ఆయన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో వివిధ కారణాలతో నష్టపోయిన ప్రజలకు చంద్రన్న బీమా ద్వారా ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకున్నట్లు తెలిపారు. అయితే రాష్ట్రంలో గత ఐదేళ్ల పరిపాలించిన జగన్మోహన్‌రెడ్డి ఏ ఒక్కరికి కూడా ఎటువంటి బీమా చెల్లించలేదని ఆరోపించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఒక వ్యక్తి పిడుగుపడి మరణిస్తే గత ప్రభుత్వ పాలనలో ఒక్క రూపాయి కూడా బీమా చెల్లించకుండా చెట్టుపై పిడుగు పడిందని అనర్హుడిగా గుర్తించినట్లు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్కరించారు, ఎన్నింటికి కేంద్ర ప్రాయోజిత పథకం వర్తింపజేశారు, తదితర వివరాలను సంబంధిత శాఖ మంత్రి వెల్లడించాలని ఎమ్మెల్యే రవి కుమార్ కోరారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏ విధమైన బీమా చెల్లింపులు చేపట్టకుండా అన్నివర్గాల ప్రజలను భారీగా మోసగించారని కూన రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

నిమ్మాడలో పట్టపగలే చోరీ

కోటబొమ్మాళి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిమ్మాడలో శిమ్మ కృష్ణారావు ఇంట్లో గురువారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.ఉదయం 11 గంటల సమయంలో కృష్ణారావు కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు.బయట నుంచి వచ్చేసరికి తాళం తీసి ఉందని, లోపలకు వెళ్లి చూడగా బీరువ తెరిచి ఉందని, అందులోని ఆరున్నర తులాలు బంగారు ఆభరణాలు కనిపించకలేదని కుటుంబసభ్యులు తెలిపారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దర్యాప్తు ప్రారంభించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

టీజీఐ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

గార, మార్చి 20(ఆంధ్రజ్యోతి):సతివాడ సమీపంలో ఉన్న ట్రాన్స్‌వరల్డ్ గార్నెట్ ఆఫ్ ఇండియా (టీజీఐ) పరిశ్రమలో గురువారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. ఏడేళ్లుగా ఈ పరిశ్రమలో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదు. పరిశ్రమ వెనుకవైపు నుంచి మంటలు వ్యాపించడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న శ్రీకాకుళం జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి వరప్రసాద్.. సిబ్బంది, రెండు అగ్నిమాపక శకటాలతో చేరుకొని మంటలను అదుపు చేశారు.ఈప్రమాదంలో ఖాళీ ప్లాస్టిక్ సంచులు, కొన్ని ఎండిపోయిన చెట్లు, పాత టైర్లు కాలిపోయినట్టు వరప్రసాద్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ఆర్.జనార్దన్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

మెళియాపుట్టిలోని జీడితోటలో..

మెళియాపుట్టి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో మాదుగుళ్ల రవికూమార్‌కు చెందిన జీడి, మామిడి తోటలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది.టెక్కలి నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలు అదుపు చేసింది. ఈ మేరకు ఏడెకరాల్లో ఉన్న జీడి, మామిడి, టేకు చెట్లు కాలిపోయినట్లు బాధిత రైతు వాపోతున్నాడు. సుమారు 10 లక్షలు వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని అంచనావేశారు.

ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు

పలాస, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జంటపట్టణాల్లోని కేటీరోడ్డు ఇందిరా చౌక్ వద్ద గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.మొగిలిపాడుకు చెందిన దుబ్బ వంశీ ద్విచక్రవాహనంపై పలాసలో తాను నిర్వహిస్తున్న చికెన్ సెంటరుకు వెళ్తున్నాడు. కాశీబుగ్గకు చెందిన మహ్మద్‌సాహిద్ అదేరోడ్డుపై ఎదురుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు.ఈ రెండువాహనాలు ఢీకొనడంతో వంశీ, సాహిద్ గాయపడ్డారు.ఈ మేరకు ఎస్ఐ ఎం.చంద్రరావు కేసు నమోదుచేశారు.

రెండు వాహనాల సీజ్.. 19 దూడల స్వాధీనం

జలుమూరు, మార్చి 20: (ఆంధ్రజ్యోతి):అక్రమంగా19 దూడలను తరలిస్తున్న రెండువాహనాలు సీజ్‌చేసి, వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.ఎస్ఐ కథనం మేరకు.. సారవకోట నుంచి నారాయణవలస సంతకు వ్యాన్‌లో పది దూడలను తరలిస్తుండగా చల్లవానిపేట కూడలిలో పట్టుకున్నారు.ఈ మేరకు అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట మండలంలోగల మున్సబుపేట గ్రామానికి చెందిన వాహన డ్రైవర్‌కమ్ యజమాని శెట్టిఏడీవీ నాగేశ్వరరావుపై కేసు నమోదుచేసి వాహనం సీజ్ చేశారు. అలాగే సారవకోట నుంచి నారాయణవలస సంతకు వాహనంలో తొమ్మిది దూడలను తరలిస్తుండగా చల్లవానిపేట కూడలిలో పట్టుకున్నారు. ఈ మేరకు జలుమూరు మండలంలోని టెక్కలిపాడు గ్రామానికి చెందిన వాన మోహనరావుపై కేసు నమోదు చేశారు.వాహనాన్ని సీజ్ చేసి దూడలను టెక్కలి సమీపంలో గల భవానీపురం గోశాలకు తరలించారు.

22 మద్యం సీసాలు..

కవిటి, మార్చి 20(ఆంధ్రజ్యోతి):చిన్న కపాసుకుద్ది గ్రామానికి చెందిన వై.కూర్మారావు నుంచి 22 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. ప్రగడపుట్టుగ జంక్షన్ వద్ద గురువారం తనిఖీలు చేస్తుండగా కవిటిలోని మద్యం షాపు నుంచి కొనుగోలు వస్తుండగా పట్టుబడినట్టు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కవిటి మండలంలోని మాణిక్యపురం సమీపతోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం గురువారం దాడి చేశామని ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.8600 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఫీల్డ్‌అసిస్టెంట్‌పై విచారణ

జలుమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అల్లాడపేట ఫీల్ అసిస్టెంట్ పంగ వెంకటరమణ అక్రమాలపై విచారణ నిర్వహించి నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు ఉపాధిహామీ ఏపీడీ పి.లోకేష్ తెలిపారు. గురువారం అల్లాడపేట గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఫీల్ అసిస్టెంట్‌పై గ్రామంలో విచారణ జరిపారు. కార్యక్రమంలో ఏపీవో శేఖర్ పాల్గొన్నారు.

పిచ్చుకలు పర్యావరణ మిత్రులు

పాతపట్నం మార్చి20(ఆంధ్రజ్యోతి):పర్యావరణ మిత్రులు పిచ్చుకలని హెచ్ఎం ఎస్.వైకుంఠ రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎన్‌టీ రామారావు, ఏపీ మోడల్‌స్కూల్‌లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వై.నీలయ్య ఆధ్వర్యంలో పిచ్చుకల పరిరక్షణాదినోత్సవాన్ని నిర్వహించారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో సత్తాచాటిన విద్యార్థులు

పాతపట్నం,మార్చి20(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్‌స్కూల్ విద్యార్థులు 2024- 25 విద్యాసంవత్సరంలో జరిగిన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో సత్తాచాటారు. ఈమేరకు బంగారుపతకాలు సాధించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వై.నీలయ్య తెలిపారు. ఆరో తరగతికి చెందిన జి.కీర్తన, సీహెచ్ బెనర్జీ, సీహెచ్ వికాశ్, ఏడో తరగతికి చెందిన ఎ.బాలచంద్ర, తొమ్మిదో తరగతికి చెందిన ఉమాశంకర్ ప్రధాన్ బంగారుపతకాలు సాధించడంతో అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

టెక్కలి, మార్చి 20(ఆంధ్రజ్యోతి):యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ ఎ.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పోలవరం గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కేశవరావు, సర్పంచ్ చిన్నమనాయుడు, ఎంపీటీసీ ధనుంజయరావు, మాజీ సర్పంచ్ ధవళ నారాయణరావు పాల్గొన్నారు.


వీఆర్‌కేపురం చెరువులో కోళ్ల వ్యర్థాలు


చెరువులో పేరుకుపోయిన కోళ్ల వ్యర్థాలు

టెక్కలి, మార్చి20(ఆంధ్రజ్యోతి):మండలంలోని వీఆర్‌కేపురం ఊటి చెరువులో చేపల మేతకు కోళ్ల వ్యర్థాలు వేస్తుండడంతో నీరు కలుషితమవుతోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. భీమవరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి స్థానికులు దగ్గర చెరువు లీజుకు తీసుకున్నారు. ఇక్కడ పెంచుతున్న చేపలకు ఆహారంగా కోళ్లవ్యర్థాలను వేస్తుండడంతో కలుషిత నీటివల్ల వ్యాధులు ప్రబలే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. కాగా చెరువులో చేపలకోసం ఆహారంగా కోళ్ల వ్యర్థాలు వేస్తున్న విషయం తనదృష్టికి రాలేదని తిర్లంగి సచివాలయ కార్యదర్శి సింహాచలం తెలిపారు.

పైపులైన్లకు లీకులు.. తాగు నీటికి అగచాట్లు

● రెండురోజులకోసారి సరఫరా ● ఇదీ ఆమదాలవలస మునిసిపాలిటీలో పరిస్థితి


పూజారిపేట వద్ద తాగు నీటి పైపు లీకైన దృశ్యం

ఆమదాలవలస, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో నాలుగు దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన పైపులైన్లు లీకులుకావడంతో తాగునీటికి ప్రజలకు పాట్లు తప్పడంలేదు. 23 వార్డులకు 19 వార్డులు పైపులైన్ల ద్వారా మిగిలిన నాలుగు వార్డులకు ట్రాక్టర్లు ద్వారా రెండు రోజులకు ఒక సారి తాగు నీరు పంపిణీచేస్తున్నారు. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలతోపాటు ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి కోట్ల రూపాయలు కేటాయిస్తున్న విషయంవిదితమే. అయినా ఇక్కడి తాగు నీటికి శాశ్వతపరిష్కారం లభించకపోవడంతోపాటు పైపులైన్లు ఆధునికీకరణకు నోచుకోవడంలేదని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆమదాలవలసలో సమితులకాలంలో 40ఏళ్ల కిందట వంశధార నది నుంచి ప్రజలకు తాగునీరు అందించడానికి పైపులైన్లు ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీఏర్పడి 30 ఏళ్లుకావస్తున్నా ఆ పైపులైన్లే కొనసాగిస్తున్నారు. కనీసం మరమ్మతులకు చర్యలు చేపట్టడం లేదు. దీంతో నిత్యం ఎక్కడో ఒకచోట లీకులుకావడంతో నీటిసరఫరా నిలిచిపోతోంది. పైపులైన్ల మరమ్మతులకు లీకేజీ ఏర్పడిప్రాంతంలో రోడ్డు మధ్యలో మునిసిపల్‌అధికారులు భారీగుంతలు తవ్వుతున్నారు.సకాలంలో పూడ్చకపోవడం తో వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. పైపుల లీకేజీ వల్ల రోడ్డు బురదమయంగా మారుతున్నాయి.దీంతో రోజుల తరబడి పైపులైన్లకు మరమ్మతులవల్ల తాగునీటిసరపరాకు అంతరాయం కలుగుతోంది. ఇటీవల లక్ష్మీనగర్‌జంక్షన్ రోడ్డుపై పైపులైన్ లీకేజీ ఏర్పడింది. సిబ్బంది మరమ్మతులకు గుంతను తవ్విసకాలంలో పూడ్చలేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకోకుండా స్థానికులు మొక్కను హెచ్చరిక బోర్డుగా ఏర్పాటుచేయడం విశేషం.

ప్రజా సేవకే జీవితం అంకితం

● వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కళావతి కుటుంబ సభ్యులు

కోటబొమ్మాళి, మార్చి 20(ఆంధ్రజ్యోతి):తమ కుటుంబసభ్యులు ప్రజాసేవకే జీవితం అంకితంచేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం నిమ్మాడలో అచ్చెన్నాయుడు మాతృమూర్తి కళావతమ్మ ప్రథమ వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న కుమారుడు అచ్చెన్నాయుడు తల్లికి పిండపదానం చేశారు. అనంతరం కళావతమ్మ ఘాట్ వద్ద అచ్చెన్నాయుడు, కేంద్ర పౌరవిమానయశాఖమంత్రి కింజరాపురామ్మోహన్‌నాయుడులతోపాటు కుమారులు హరివరప్రసాద్, ప్రభాకర్, కుటుంబ సభ్యులు పూలమాలలువేసి నివాళులర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గొంతులో ప్రాణం ఉన్నంతవరకూ ప్రజలకు సేవలందిస్తూ ఎర్రన్నాయుడుకు ఆదర్శంగా నిలబడతామని తెలిపారు. నియోజకవర్గంతోపాటు జిల్లా నలుమూలలనుంచి టీడీపీ కార్యకర్తలు, నేతలు, అభిమానులు తరలివచ్చి కళావతమ్మకు నివాళులర్పించారు.

పి-ఫోర్ విధానంపై సర్వే

టెక్కలి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పి-ఫోర్ విధానంపై సబ్‌కలెక్టరేట్ డిప్యూటీ గణంకాధికారి పీసీ నందా సర్వే నిర్వహించారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యం,వాటి ఉపయోగాలపై ఆయుష్మాన్ రీజనల్ కోఆర్డినేటర్లు కె.శ్రీనివాసరావు, ఎస్.రామచంద్రరావు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, జి.వెంకటరెడ్డి, సీహెచ్ సుగుణాధనరావు పాల్గొన్నారు.

ఉద్యోగులకూ సూర్యఘర్ సబ్సిడీ: ఎల్‌డీఎం

నరసన్నపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంకింద ప్రభుత్వ ఉద్యోగులకు కూడా సబ్సిడీ వర్తిస్తుందని లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జాయింట్ మండల లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకానికి బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీఎం రమేష్ కృష్ణ, డీపీఎం జి.నారాయణరావు, ఏసీలు శ్రీరాములు, కొండలరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

మెళియాపుట్టి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలోని రాధగోవింద స్వామి ఆలయ భూముల్లో పాతపట్నం దేవదాయశాఖ మేనేజర్ వాసుదేవు ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇక్కడ అక్రమ కట్టడాలతో పాటు అమ్మకాలు కొనుగోళ్లు జరుగుతున్నాయని టెక్కలికి చెందిన న్యాయవాది దాడి ధర్మారావు దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

మెళియాపుట్టి, మార్చి 20(ఆంధ్రజ్యోతి):తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్‌పండా కోరారు. గురువారం సుర్జిణి గ్రామంలో తాగు నీటి సమస్యపై ఫిర్యాదు మేరకు కార్యదర్శి మోహనరావుతో కలిసి పరిశీలించారు.

పంచసూత్రాలు పాటించాలి

హరిపురం, మార్చి20 (ఆంధ్రజ్యోతి):పంచసూత్రాలు పాటిస్తేమహిళలు ఆర్థికశక్తి వంతంగా తయారవుతారని ఏపీఎం పి.కూర్మారావు తెలిపారు. గురువారం మందస మండలంలోని కొత్తపల్లిలో గ్రామైక్య సమావేశం నిర్వహించారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ

వజ్రపుకొత్తూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):వజ్రపుకొత్తూరు హైస్కూల్ ఆవరణలో వజ్రపుకొత్తూరు, పలాస మండలాలు, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల 145 మంది అంగన్‌వాడీ సిబ్బందికి గురువారం పోషన్ బీ పడాయిబీ కార్యక్రమంలో భాగంగా మూడురోజులు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటరమణ, కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో పార్వతి పోషన్ బీ పడాయిబీ కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, లత, గంగమ్మ, సరస్వతి, జయమ్మ పాల్గొన్నారు.

● పాతపట్నం మార్చి20(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణబీ- పడాయి బీ తొలివిడత శిక్షణ ప్రారంభించారు.కార్యక్ర మంలో సీఎస్‌డీటీ ప్రసాదరావు, టి.విమలారాణి, హేమసుందర్ పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల సమావేశం

నందిగాం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఎల్లమ్మతోటలో ఉత్తరాంధ్ర స్థాయి జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు టి.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 010 పద్దు కింద పెన్షనర్ల చెల్లింపు, సెస్ వసూళ్లపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బన్నువాడలో శుక్రవారం లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం-2012 అన్న అంశంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు తెలిపారు. సదస్సుకు విజయవంతం చేయాలని కోరారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

హరిపురం మార్చి20 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలకోసం శనివారంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్. రమేష్ నాయుడు కోరారు. మందసలో విలేకరులతో మాట్లాడుతూ బీసీల్లో వివిధ కేటగిరీల్లో మొత్తం 78 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రతి యూనిట్‌కు 50శాతం రాయితీ వర్తిస్తుందని చెప్పారు ఇంటర్నెట్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని, కాపీని ఎంపీడీవో కార్యాలయానికి అందజేయాలని కోరారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వంబ్రాహ్మణులకు అందజేస్తున్న 50 శాతం రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఒడియా బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివాజీ పాణిగ్రాహి కోరారు. గురువారం మందసలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని ఆర్థికస్వావలంబన సాధించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిదుర్గాప్రసాద్ పాణిగ్రాహి పాల్గొన్నారు.

● పలాసరూరల్,మార్చి20(ఆంధ్రజ్యోతి): బీసీ రుణాలకు శనివారంలోగా దరఖాస్తులు సచివాలయాల అధికారులకు అందజేయాలని ఎంపీడీవో ఎస్.వసంత్‌కుమార్ కోరారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు ..

వజ్రపుకొత్తూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి ఎంజేపీ బీసీ గురుకుల బాలుర పాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.ప్రశాంతి పేర్కొన్నారు. ఏప్రిల్ 27న పరీక్ష జరుగుతుందని తెలిపారు.

బార్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

కోటబొమ్మాళి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లఖినేని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గురువారం స్థానిక సివిల్ జడ్జి కోర్టులో బోరు అసోషియేషన్ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈసందర్భంగా జనరల్‌సెక్రటరీగా ఉప్పాడ తిరుమలరావు, ఉపాధ్యక్షుడిగా సంపతిరావు తిరుపతి, సహాయకార్యదర్శిగా కె. వెంకటరావు, ట్రెజరర్‌గా ధర్మారావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది ఎండ వెంకటరావు వ్యవహరించారు.

తప్పిదాలకు అవకాశం ఇస్తే చర్యలు: పీడీ

నందిగాం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులపై చేపడుతున్న సామాజిక తనిఖీల్లో తప్పిదాలకు అవకాశం ఇస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ సుధాకరరావు హెచ్చరించారు. గురువారం నందిగాం మండల కాంప్లెక్స్ ఆవరణలో 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పథకం, నీటిపారుదల శాఖ, పంచాయరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సామాజిక అడవులు, సమగ్రశిక్ష అభియాన్ చేపట్టిన రూ.22,99,68,284లకు సంబంధించి ఎస్‌ఆర్‌పీ ఎం.తిరుపతిరావు, ఏడుగురు డీఆర్పీలు ఆధ్వర్యంలో చేసిన తనిఖీల వివరాలను సభ ముందు వివరించారు. తనిఖీల్లో లక్షల్లో తప్పిదాలు గుర్తించగా రూ.64,500లు రికవరీ చేశామని, రూ.91వేలు జరిమానా విధించినట్లు పీడీ పేర్కొన్నారు. కార్యక్ర మంలో జిల్లా విజిలెన్స్ అధికారి స్వరూపారాణి, ఏపీడీలు పి.రాధ, శైలజ, ఎంపీడీవో టి.రాజారావు, ఏపీవో ఎం.నాగరాజు, పీఆర్ ఏఈ పి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మిషన్‌వాత్సల్యను ప్రోత్సహించండి

పలాస, మార్చి 20(ఆంధ్రజ్యోతి):మిషన్‌వాత్సల్యను ప్రోత్సహించాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. గురువారం పలాసలో సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి ప్రతినెలా వచ్చే రూ. నాలుగు వేల సహాయంకోసం పిల్లల సంరక్షుల పేరుపై జాయింట్ అకౌంట్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కోటబొమ్మాళి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌టీఎల్ ప్రకాష్ తెలిపారు.గురువారం కోటబొమ్మాళిలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్‌ప్రణాళికలో భాగంగా సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఆర్‌టీవో హేమసుందర్, డీపీఎం రేవతి, ఎంఏవో రంగరావు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి



గొట్టిపల్లి సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆదివాసీ సంఘ నాయకులు

కొత్తూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి):అటవీ ఉత్పత్తులను జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘనాయకులు కోరారు.ఈ మేరకు గురువారం గొట్టిపల్లి సచివాలయం ఎదుట ఆదివాసీలు చీపుర్లతో నిరసన తెలిపి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న మాట్లాడుతూ జిల్లాలోని 12 మండలాల్లో లక్ష మందికిపైగా గిరిజన కుటుంబాలు పోడు వ్యవసాయం చేసి జీవిస్తున్నాయని, వీరి పండించే పంటలకు మద్దతు ధర లేక నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు శిర్ల ప్రసాదరావు,గిరిజన సంఘ నాయకులు సవర మోహన్, జమ్మయ్య, సూర్యనారాయణ, బాగన్న, సవర నాగేష్, నిమ్మక రత్నాలమ్మ పాల్గొన్నారు.

నీలమణి దుర్గ ఆదాయం రూ.4.19 లక్షలు

పాతపట్నం, మార్చి20 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని నీలమణిదుర్గ ఆలయానికి 37 రోజులకు గాను రూ.4,19,671 ఆదాయం లభించినట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఆమదాలవలస గ్రూప్ ఆలయాల కార్యనిర్వహణాధికారి టి.రవి పర్యవేక్షణలో హుండీలను గురువారం లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎ.సుదర్శనరావు, వెంకటేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.